క్లుప్తంగా

6న పాపమాంబ ఆరాధనోత్సవాలు


పాపమాంబదేవి

ఆదోని టౌన్: స్థానిక మరాఠీగేరిలో వెలిసిన పాపమాంబ 65వ ఆరాధనోత్సవాలను ఈనెల 6వ తేదీన నిర్వహిస్తామని నిర్వాహకులు గురువారం తెలిపారు. వార్డులోని సద్గురు సర్కార్ స్వామి ధ్యానమందిర మఠంలో ఉత్సవాలు ఉంటాయని యల్లమ్మ, రమేష్, ట్రస్టు బోర్డు సభ్యులు తెలిపారు. 6న వేకువజాము నుంచే అమ్మవారికి అభిషేకం, పూల అర్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఉత్సవాలు జరిపిస్తామని చెప్పారు. సాయంత్రం పుర వీధుల్లో పాపమాంబమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

దర్గాకు పోటెత్తిన భక్తులు


దర్గాలో పూజలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న కౌతాళం జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలి వచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఆదోని రూరల్: మండలంలోని కడితోట–గణేకల్ రహదారిలో రోడ్డుపై గుర్తు తెలియని పురుషుడి మృతదేహం బుధవారం రాత్రి లభ్యమైందని పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య గురువారం తెలిపారు. రాత్రి 8 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి ఉండొచ్చని చెప్పారు. చామనఛాయ రంగు, లైట్ బ్లూ కలర్ ఫుల్ షర్ట్, బూడిద రంగు అడ్డుపంచ ధరించాడన్నారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ 9121101144 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నిర్భయంగా ఓటు వేయండి


ఆదోనిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆదోని అర్బన్: పట్టణంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలనీల్లో సీఐ గోపీ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఎస్‌కేడీ కాలనీ, క్రాంతినగర్, మహాత్మాగాంధీ నగర్, ఆర్‌ఆర్ లేబర్ కాలనీల్లో కవాతు చేపట్టారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. పోలీసుల భద్రత నడుమ ఓటింగ్ జరుగుతుందని, ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీసులు కృషి చేస్తారని చెప్పారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్‌ఐ గోపాల్

ఆదోని సెంట్రల్: కోసిగి–కుప్పగల్ రైల్వేస్టేషన్‌ల మధ్య 518/11–13 కి.మీ. మధ్య పీకలబెట్ట గ్రామం వద్ద గురువారం ఉదయం 9:30 గంటల సమయంలో తెలుగు కృష్ణ (49) రైలు నుంచి జారి కిందపడి మృతి చెందాడని రైల్వే ఎస్‌ఐ కె.గోపాల్ తెలిపారు. మృతుడు ఆదోని పట్టణంలోని రాయనగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. సమాచారాన్ని మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేసినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మూర్ఛవ్యాధితో వ్యక్తి మృతి


మృతిచెందిన రాజేంద్రప్రసాద్

ఆదోని అర్బన్: డోన్ పట్టణానికి చెందిన రాజేంద్రప్రసాద్ (46) కోర్టు పనిపై ఆదోనికి వచ్చి మృత్యువాత పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ గోపీ తెలిపిన వివరాల మేరకు.. పొలం విషయంపై అడ్వకేట్‌తో మాట్లాడేందుకు ఆదోనికి వచ్చారని, స్థానిక కోర్టు సమీపంలో మూర్ఛవ్యాధితో మృతిచెందినట్లు చెప్పారు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రెండో రోజూ పింఛన్ కష్టాలు

- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌పై పింఛన్‌దారుల ఆగ్రహం
- తమను రోడ్డు మీదకు లాగిన వారికి ఊసురు తగులుతుందని శాపనార్థాలు
- పింఛన్ తెచ్చిచ్చేటోళ్లను లేకుండా చేశారు – వారిని రాష్ట్రం నుంచే లేకుండా చేద్దామంటూ భీష్మించుకున్న వృద్ధులు


గణేకల్‌లో మసీదు వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు


బదినేహాల్‌లో చంద్రబాబుకు శాపనార్థాలు పెడుతున్న వృద్ధులు

ఆదోని రూరల్: మండలంలో రెండో రోజూ గురువారం కూడా పింఛన్ కష్టాలు అవ్వతాతలకు తప్పలేదు. ప్రతిపక్ష కూటమిగా మారి వలంటీర్ వ్యవస్థపై కుట్రపన్ని విధులకు దూరం చేయడంతో తమకు ఇక్కట్లు కలిగిస్తున్నారని పింఛన్‌దారులు శాపనార్థాలు పెడుతున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు 91.07 శాతానికి పైగా పింఛన్ల పంపిణీని రెండు రోజుల్లో పూర్తి చేశారు. మిగిలిన నడవలేని వికలాంగులు, దివ్యాంగులకు పింఛన్లను సచివాలయ అధికారులు ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయనున్నారు. మండలంలో 11,898 మంది పింఛన్‌దారులు ఉండగా, 10,739 మందికి రూ.3,23,31,000 పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆదోని సెంట్రల్: గురువారం కూడా పింఛన్లు తీసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. పండుటాకులు, దివ్యాంగులు ఇతర సాయంతో రావాల్సి వచ్చింది. ఎవరూ లేనివారు రావడానికి అష్టకష్టాలు పడ్డారు. పట్టణంలోని 42 వార్డు సచివాలయాల్లో 17,399 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వీరిలో వృద్ధులు 7,840 మంది, దివ్యాంగులు 2,209 మంది ఉన్నారు. వితంతువులు 6,130 మంది, ఒంటరి మహిళలు 739 మంది, ట్రాన్స్‌జెండర్స్ 29 మంది ఉన్నారు. వీరికి ప్రతి నెల రూ. 5,21,41,500 నగదును పంపిణీ చేస్తున్నారు.

టీడీపీ హయాంలో..

వృద్ధాప్యం ఇబ్బంది పెడుతున్నా, అంగవైకల్యం బాధిస్తున్నా, మంచం మీద నుంచి లేవలేకున్నా, టీడీపీ హయాంలో నిర్దేశించిన కార్యాలయం, ప్రాంతం వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము తీసుకోవాల్సి వచ్చేది. ఇలా రెండు మూడు సార్లు తిరిగితే కానీ ఆ సొమ్ము చేతికందేది కాదు. ఇలా ప్రతి నెలా వారికి అవస్థలు నిత్యకృత్యమయ్యాయి. అయితే జగనన్న పాలనలో ఇంటికే వచ్చి ఇస్తుండటంతో ఆ ఇబ్బందులు తప్పాయి. మళ్లీ ఈ నెల నుంచి నాటి ఇబ్బందులు పునరావృతం కావడంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే తాము ఇంకెన్ని ఇబ్బందులు పడాలోనంటూ భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

అవస్థలు.. శాపనార్థాలు

కౌతాళం: తెల్లవారకముందే ఇంటి గుమ్మం తట్టి పింఛన్ డబ్బుల్ని చేతిలో పెట్టడం నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పథకాలను సకాలంలో అందిస్తున్న వలంటీర్ల సేవలను దూరం చేసిన ప్రతిపక్ష పార్టీల నాయకులకు తమ ఉసురు తగులుతుందని పింఛన్‌దారులు శాపనార్థాలు పెట్టారు. గురువారం పింఛన్‌దారులు మండుటెండలో అవస్థలు పడుతూ సచివాలయాలకు చేరుకుని, తమ వంతు వచ్చే వరకు వేచిఉండి పింఛన్ సొమ్ము తీసుకున్నారు. పింఛన్ డబ్బులతో నెల రోజుల పాటు తమకు ఆర్థిక చేదోడుగా ఉంటుందని, వైఎస్ జగన్ ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా ఇంటివద్దనే పింఛన్ సొమ్ము అందించడంతో సంతోషంగా ఉన్నామన్నారు. ఇప్పుడు చంద్రబాబు కుట్రతో కార్యాలయాలకు రప్పించి పాత రోజుల్లోని కష్టాలు గుర్తుకొచ్చేలా చేశాడని, ఆయనకు తగిన బుద్ధి చెబుతామన్నారు. తన కాళ్లు చచ్చుపడ్డాయని కిలోమీటర్ల దూరంలోని సచివాలయానికి ఎలా రావాలని బదినేహాల్‌కు చెందిన మాల ఉసేని అన్నారు. 70 ఏళ్ల వయసున్న తమలాంటి వారు ఎలా వస్తారని కౌతాళంకు చెందిన లక్ష్మి ప్రశ్నించింది. పక్షవాతంలో నడవలేమని ఇంటి వద్దకే పింఛన్ ఇవ్వాలని బదినేహాల్‌కు చెందిన చిన్న ఉసేని, కురవ రాఘవన్న, నటరాజ్ కోరారు. ఇదిలా ఉండగా గురువారం నాటికి 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా తెలిపారు.


బదినేహాల్‌లో పింఛన్ కోసం అవస్థలు పడుతూ వస్తున్న దివ్యాంగులు

ఇదెక్కడి న్యాయం



ప్రతిపక్ష పార్టీ వాళ్లకు పోయే కాలం వచ్చింది. మాలాంటి ముసలివాళ్లు సచివాలయాల వద్దకు వచ్చి పింఛన్ ఎలా తీసుకోవాలి. కాళ్లు నడవడానికి రావడం లేదు. నా లాంటి వారికి ఇంటి వద్దనే పింఛన్ ఇచ్చేవారు ఇప్పుడు సచివాలయానికి వెళ్లి తీసుకోమంటున్నారు. ఇదెక్కడి న్యాయం. మంచి చేసే వారికి కూడా చేయనివ్వడం లేదు.

– లక్ష్మి కౌతాళం గ్రామం

మంచి చేసే వారిని చేయనివ్వరు



మంచి చేసేవారిని చేయనివ్వరు. ఇంటి వద్దనే పింఛన్ తీసుకుంటున్న తమను మళ్లీ సచివాలయాల వద్ద పడిగాపులుగాసేలా చేయడం మంచిదికాదు. నా రెండు కాళ్లు చచ్చుపడ్డాయి. సచివాలయానికి రావాలంటే ఎంత కష్టంగా ఉంటుంది. ఒకరి సహాయంతో కర్ర పట్టుకుని ఇక్కడిదాకా వచ్చాను. ప్రతిపక్ష పార్టీల వారు ఇలాంటి పనులు చేస్తే వారికి ఏమొస్తుందో?

– ఉసేని, బదినేహాల్ గ్రామం

మా ఉసురు తగులుతుంది



మాకు ఇంటి వద్దకు వచ్చే పింఛన్ చంద్రబాబునాయుడు రాకుండా చేశాడు. నా వయస్సు 75 యేళ్లు. కంటి చూపు కూడా సరిగా లేదు. నేను సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ తీసుకోలేని పరిస్థితి. నాకు ఈనెల పింఛన్ అందుతుందో లేదోనని భయంగా ఉండేది. ఎట్టకేలకు గురువారం సాయంత్రం సచివాలయ అధికారులు ఇంటి వద్దకు వచ్చి పింఛన్ ఇచ్చి వెళ్లారు. మమల్ని ఇన్ని ఇబ్బందులు పెట్టిన బాబుకు మా ఉసురు తగులుతుంది. – హెచ్.రంగమ్మ, పెద్దతుంబళం


గణేకల్‌లో సచివాలయం వద్ద పింఛన్ కోసం వేచి ఉన్న వృద్ధులు


పింఛన్ కోసం దివ్యాంగ కుమారుడిని ఎత్తుకొచ్చిన తండ్రి


పెద్దహరివాణంలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

జగనన్నతోనే సంక్షేమపాలన


పల్లెపాడులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమపాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి అన్నారు. గురువారం కోసిగి మండలంలోని పల్లెపాడు, చింతకుంట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో సుభిక్ష పాలన అందించారని గుర్తుచేశారు. గతంలో ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేశారని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. ప్రస్తుత ఎన్నికల్లో నడవలేని దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించారని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, శ్రీనివాస రెడ్డి, జగదీష్ స్వామి, బుళ్లి నరసింహులు, ప్రతాప్, దొడ్డి నరసన్న తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం వెళ్లి వృద్ధురాలి మృతి


నాడుగేని ముత్తమ్మ (ఫైల్)

కోసిగి: స్థానిక నాడుగేని వీధిలో నివాసం ఉంటున్న నాడుగేని ముత్తమ్మ (75) గురువారం పింఛన్ కోసం వెళ్లి మృత్యువాత పడింది. పింఛన్ కోసం సచివాలయం వద్దకు వెళ్లాలని చెప్పడంతో ఒంటరిగా కర్ర సాయంతో వెళ్లే ప్రయత్నం చేసిన ముత్తమ్మ ఎండ తీవ్రతకు తట్టుకోలేక సొమ్మసిల్లిపడిపోయి మృతి చెందిందని కుటుంబ సభ్యులు వాపోయారు. వలంటీర్ సేవలను దూరం చేసి వృద్ధులను బలిగొంటున్న ప్రతిపక్షనేత చంద్రబాబుకు వారి ఉసురు తప్పదని శాపనార్థాలు పెట్టారు. ఎన్నికల ప్రచారంలో ఉండగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి తరఫు వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఐరన్‌గల్లు శ్రీనివాస రెడ్డి, నాడుగేని నాగరాజు, వీరేష్ వృద్ధురాలి మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు.

పోస్టు ద్వారా ఓటరు కార్డుల జారీ

ఆలూరు రూరల్: కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్న వారికి ఎన్నికల సంఘం ఓటరు కార్డులను మంజూరు చేస్తోంది. స్పీడ్ పోస్టులో నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు పంపిస్తోంది. ఎన్నికల సంఘం రూపొందించిన ఎపిక్ కార్డు భద్రతా ప్రమాణాలను కలిగి ఉన్నాయి. నకిలీ ఓటర్లు, దొంగ ఓట్లను నివారించేందుకు ట్యాంపరింగ్ చేసేందుకు వీల్లేని విధంగా హాలోగ్రామ్ ఉంది. కార్డు వెనుక భాగంలో ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఓటరు వివరాలు కనిపిస్తాయి. గతం కంటే మెరుగ్గా ఓటరు ఫొటో స్పష్టంగా ఉండటంతో పాటు వారి పేరు, చిరునామా పూర్తి వివరాలను తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ముద్రించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యవకులు ఏప్రిల్ 15వ తేదీ వరకు కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవచ్చని ఎన్నికల అధికారులు వెల్లడించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

దేవనకొండ: మండలకేంద్రంలో ఇంటి నంబర్ 2/77/1లో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. పేకాట ఆడుతున్న ఈడిగ రామదాసుగౌడ్ (బైరవకుంట), బోయ కౌలుట్ల (గద్దెరాళ్ల), బోయ కనికిటి వెంకటేష్ (కప్పట్రాళ్ల), బోయ తలారి రంగస్వామి (పల్లెదొడ్డి), బోయ బసవరాజు (పల్లెదొడ్డి), గొల్ల తిరుపతయ్య (పల్లెదొడ్డి), బోయ వీరేంద్ర (కుంకనూరు)లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.14,150 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని, పంచనామా చేసినట్లు చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

నందవరం: మండలంలోని కనకవీడు పేట గ్రామంలో ఇలవేల్పు, మహిమాన్వితులు రామప్ప, లక్ష్మప్ప విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుక వైభవంగా జరిగింది. గురువారం ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా కానిచ్చారు. అంతకుముందు అశ్వర్థ నారాయణ కల్యాణ వేడుక గావించి శాంతి, వాస్తు, లోకకల్యాణ హోమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక వేడుకలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆమెతోపాటు పేట శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు విరుపాక్షిరెడ్డి, డీలర్ ఈరన్న, వడ్డె హనుమంతు, నల్లన్న, వెంకటేష్, కోసిగి ఈరన్న, రామన్న గౌడ్ తదితరులు ఉన్నారు.

గాదిలింగేశ్వర స్వామి ఆలయంలో నెల పూజ



హాలహర్వి: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గాదిలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం నెలపూజ కార్యక్రమాన్ని ఆలయ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టారు. కర్ణాటక, ఆంధ్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి జోడు రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగి నెల రోజులు పూర్తికావడంతో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రచారానికి శ్రీకారం
- పాలనను చూసి ఆశీర్వదించాలని మనవి

తారాపురంలో ప్రచారభేరి


తారాపురంలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం/పెద్దకడబూరు: ప్రతిపక్ష టీడీపీ నేతలు ఎన్ని కుయుక్తులు, కుట్రలు పన్నినా విజయం తనదేనని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆయన గురువారం పెద్దకడబూరు మండలం తారాపురం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆనవాయితీ ప్రకారం గ్రామంలోని గిడ్డాంజనేయ స్వామికి మొక్కులు తీర్చుకుని ప్రచారం మొదలుపెట్టారు. ఇంటింటికీ వెళ్లి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న మేనిఫెస్టోలో పేర్కొన్న 99 శాతం హామీలను నెరవేర్చారని గుర్తు చేశారు. టీడీపీ నేత చంద్రబాబుకు మతి భ్రమించి ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎమ్మిగనూరు ప్రచార సభలో తమ కుటుంబంపై అక్కసు వెళ్లగక్కారని ఆరోపించారు. తమను వలస వచ్చారని పేర్కొన్నారని, చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్ సైతం వలస వచ్చి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ కూటమి తరపున ఎవరు బరిలో నిలిచినా నాల్గవ సారి విజయం తనదేనని ధీమా వ్యక్తం చేశారు. తారాపురం గ్రామస్తుల కోరిక మేరకు జలజీవన్ మిషన్ కింద రూ.80 లక్షలు ఖర్చు చేసి తాగునీటి కష్టాలు తీర్చామని చెప్పారు. అబద్ధాలు చెప్పే టీడీపీ నేతలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రస్తుతం వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇంటి వద్ద పింఛన్లు అందకపోవడంతో ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, చంద్రబాబు దుర్మార్గపు ఆలోచన వల్లనే నిరాధార పేదబతుకులకు ఇక్కట్లు వచ్చాయన్నారు. ఇలాంటి వ్యక్తులు అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు చేయడం కంటే కక్ష సాధింపునకు దిగడం ఖాయమన్నారు. ప్రజలు చంద్రబాబు మాటలు నమ్మే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాజేశ్వరి, రాజశేఖర్ రెడ్డి, గజేంద్ర రెడ్డి, జాము మూకయ్య, వెంకటేశ్వర రెడ్డి, చంద్రశేఖర్, ఈరన్న, గ్రామ నాయకులు భరత్ కుమార్ కౌశిక్, రామిరెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలో 9 మంది వార్డు వలంటీర్లు తమ వ్యక్తిగత కారణాలతో గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయా వార్డుల సచివాలయాల అడ్మిన్‌లకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. 24వ వార్డు క్రాంతినగర్‌లో సునీత, సుమంగళ, విజయ, పార్వతి, నాగవేణి, కుసుమ, రూప, 14వ వార్డులో మోహన్‌కుమార్, అవినాష్ రాజీనామా చేశారు. కాగా వారి రాజీనామా పత్రాలను అడ్మిన్‌లు ఆమోదం కోసం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి అందజేయగా ఆమోదిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

మరో ఇద్దరు రాజీనామా

ఆదోని రూరల్: పెద్దతుంబళం గ్రామానికి చెందిన బుడగ జంగాల ఏక్‌నాథ్, పి.ఉశేని వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, బీజేపీ నాయకులు వలంటీర్ వ్యవస్థను అవహేలన చేయడంపై మనస్థాపం చెంది రాజీనామా చేసినట్లు వారు తెలిపారు. రాజీనామా పత్రాలను ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయశేఖరరావుకు అందజేసినట్లు చెప్పారు.

బైండోవర్ కేసుల నమోదు

మంత్రాలయం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కల్లుదేవకుంట గ్రామానికి చెందిన ఐదుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపీనాథ్ తెలిపారు. ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా కేసులు నమోదు చేపట్టినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

ఆదోని రూరల్: నియోజకవర్గ ఎంఐఎం ఇన్‌చార్జ్ ఉమ్మి యూసుఫ్ గురువారం రాత్రి హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ఆమె యూసుఫ్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పీఈటీపై చర్యలు

మద్దికెర: బాలికతో దురుసుగా ప్రవర్తించిన పీఈటీ సస్పెన్షన్‌కు గురయ్యారు. వివరాలు.. మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన బాలిక గుంతకల్లులోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతోంది. గత శనివారం బాలిక స్నాక్స్ చోరీ చేసిందని ఓ విద్యార్థిని పీఈటీ అనితకు ఫిర్యాదు చేయడంతో బాలికను దండించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక హాస్టల్ గదిలో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు చెప్పడంతో కిందకు దించారు. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సనందించారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా విద్యార్థిని పట్ల దురుసుగా ప్రవర్తించిన పీఈటీ అనితను సస్పెండ్ చేస్తున్నట్లుగా కేజీబీవీ రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్ ఆదేశాలు జారీ చేశారు.

ఉన్నత లక్ష్యంతోనే జీవితంలో రాణింపు

- ఆర్‌యూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్‌ప్రేమ్‌కుమార్


క్విజ్ విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ సుధీర్ ప్రేమ్ కుమార్, రెక్టార్ ఎన్.టి.కె.నాయక్, రిజిస్ట్రార్ నాగుల అంకన్న

కర్నూలు కల్చరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యం కలిగి ఆ దిశగా సాధన చేస్తే జీవితంలో రాణిస్తారని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. సుధీర్‌ప్రేమ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రతి సంవత్సరం నిర్వహించే క్విజ్ పోటీల క్విజ్ ఛాంపియన్‌షిప్ -2024 రీజనల్ క్వాలిఫైర్స్ రౌండ్‌ను గురువారం వర్సిటీ సెనేట్ హాల్‌లో వీసీ ప్రారంభించి ప్రసంగించారు. ఉన్నత విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించే విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా వివిధ విషయాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రాజెక్ట్ వర్క్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, ఇంటర్న్ షిప్ లాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం రీజనల్ స్థాయి పోటీల నిర్వహణ బాధ్యతను రాయలసీమ యూనివర్సిటీకి అప్పగించారన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని మరింత ముందుకు సాగాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న, ఉన్నత విద్యా మండలి అకడమిక్ ఆఫీసర్ ఆచార్య ఎస్.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం క్విజ్ విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.వి.కృష్ణారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య ఎన్.నరసింహులు, పరీక్షల విభాగం డీన్ ఆచార్య పుచ్చా వెంకట సుందరానంద్, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య భరత్‌కుమార్, రీసెర్చ్ డైరెక్టర్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. హరిప్రసాద్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి యంగ్ ప్రొఫెషనల్ శ్రీజ, అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎండలపై జాగ్రత్తగా ఉండాలి

కోడుమూరు రూరల్ : మండుతున్న ఎండల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోడుమూరు కోలొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మదన్ శేఖర్ సూచించారు. గురువారం స్థానిక కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలంతా 11 గంటల కల్లా పనులు చేసుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. ఎండల్లో తిరగడం, శ్రమ చేయడం వల్ల అలసట, వికారం, వాంతులు, నోరు, కళ్లు పొడి బారడం వంటి డీహైడ్రేషన్ లక్షణాలు కన్పిస్తే వెంటనే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాపుకుంటూ దగ్గరలోని హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌసియాబేగం, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులున్నారు.